ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలి

గజ్వేల్, మే 29: ప్రభుత్వం ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల ప్రమోషన్లు , బదిలీలు చేపట్టాలని టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ కోరారు. బుధవారం గజ్వేల్‌లోని టీపీటీఎఫ్ కార్యాలయంలో జెండాను ఎగురవేసిన సం దర్భంగా ఆయన మాట్లాడారు. 317జీ వో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో పెరిగిన ధరలకు అనుగుణంగా వేత న సవరణ చేయాలన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రం, సంఘం నాయకులు రాజులు, ఎల్లయ్య, నర్సింహులుగౌడ్, మల్ల య్య, కనకరాజు, రవీందర్, నర్సయ్య, విద్యాసాగర్, కటుకం రాజయ్య పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి

నారాయణరావుపేట, మే 29: హార్టికల్చర్ పై దృష్టి సారించే విధంగా రైతులను ప్రోత్సహించాలని డీఆర్డీవో జయదేవ్‌ఆర్య సిబ్బందికి సూచించారు. బుధవారం నారాయణరావుపేట రెడ్డి భవనంలో ఉపాధి హామీ పనుల మూడో విడత సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో (2023–2024 సంవత్సరం) జరిగిన రూ. 1.98 కోట్ల విలువ గల పనుల పై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. రికార్డు నిర్వహణ లోపం, నిర్లక్ష్యం పై రూ. 34,820 జరిమానా, రికవరీ చేసినట్లు తెలిపారు. కూలీలకు పని కల్పించడంలో నారాయణరావుపేట మండలం జిల్లాలోనే మొదటి మూడు స్థానాల్లో ఉండేదని, గత మూడు వారాలుగా చాలా వెనుకబడి ఉందన్నారు. నాటేందుకు హరితహారం మొక్కలు సిద్ధం చేయాలన్నా రు. ఏపీడీ శివాజీ, డీపీవో ప్రభాకర్, ఎంపీడీవో శ్రీరాములు, క్వాలిటీ కంట్రోలర్ సంతోష్‌రెడ్డి, ఏపీవోలు నూరొద్దీన్, స్రవంతి పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ నీలకంఠేశ్వర స్వామి కల్యాణం

గౌరీ నీలకంఠేశ్వర స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

సిద్దిపేట,మే29: నీలకంఠ సమాజ సభ్యులందరూ గౌరీ నీలకంఠేశ్వర స్వామి కల్యాణం జరిపించడం అభినందనీయమని సద్గురు నీలకంఠ పట్టాచార్య స్వామీజీ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని గౌరీ నీలకంఠేశ్వర ఆలయ 33వ వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతుండగా బుధవారం గౌరీ నీలకంఠేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. సద్గురు నీలకంఠ పట్టాచార్య స్వామీజీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన నీలకంఠ సమాజ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలు అందజేశారు. ప్రతి సంవత్సరం టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారికి నగదు ప్రోత్సాహం అందిస్తున్న కడవెరుగు నర్సింహులు , శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్, మధుసూదన్‌ను అభినందించారు. అనంతరం గౌరీ నీలకంఠేశ్వరస్వామి విగ్రహాలతో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సమాజం అధ్యక్షుడు యోగేశ్వర్, నాయకులు సురేశ్, లక్ష్మీరాజ్యం, జనార్దన్, రాజు పాల్గొన్నారు.

చేర్యాలలో మహిళా గురుకులం ఏర్పాటు



చేర్యాలలో సాంఘిక సంక్షేమ గురుకులం భవనం బోర్డు

చేర్యాల, మే 29 : చేర్యాల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఉన్న భవనంలో ఈ విద్యా సంవత్సరం నుంచి మహిళా గురుకుల పాఠశాల, కళాశాల అందుబాటులో రానున్నది. ఇదే భవనంలో గతంలో కొనసాగిన సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల సిద్దిపేట జిల్లా కేంద్రం సమీపంలోని మిట్టపల్లికి తరలిపోయింది. భవనం ఖాళీగా ఉండడంతో జనగామ నియోజకవర్గంలోని నర్మెట్టకు చెందిన మహిళా గురుకులం ఈ విద్యా సంవత్సరం నుంచి చేర్యాలలో కొనసాగించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా సంబంధిత శాఖ అధికారులు భవనం ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు దానికి కళాశాల పేరు తదితర వాటిని పొందుపర్చి సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నర్మెట్టకు చెందిన సదరు గురుకుల పాఠశాల గడిచిన విద్యా సంవత్సరం వరకు జనగామలోని ఓ ప్రైవేట్ భవనంలో కొనసాగింది.చేర్యాలలో ప్రభుత్వ భవనం అందుబాటులో ఉండడంతో ఇక శాశ్వతంగా ఇక్కడే గురుకులం కొనసాగించనున్నారు. ఇప్పటికే చేర్యాలలో సాంఘిక సంక్షేమ గురుకుల, కళాశాల(పురుషుల) ఉండగా, తాజాగా గర్ల్స్ కళాశాల అందుబాటులోకి వస్తుండడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గుడిలోకి దళిత స్వాములకు నిరాకరణ

ముగ్గురిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

సీతారాంపల్లిలో చౌక్కాతో గుడి గేటుకు బంధించిన దృశ్యం

సిద్దిపేటరూరల్, మే 29: హనుమాన్ మాల ధరించిన దళిత స్వాములు పూజల కోసం సీతారాంపల్లిలోని అంజన్న గుడిలోకి వెళ్లగా నిరాకరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి తెలిపారు. సీతారాంపల్లికి చెందిన దళితుడు మిట్టపల్లి కిషన్, అదే గ్రామానికి చెందిన మరో ఐదుగురు కొన్నిరోజులక్రితం హనుమాన్ మాల ధరించారు. బుధవారం రాత్రి సమయంలో పూజ చేసుకునేందుకు సీతారాంపల్లిలోని అంజన్న గుడికి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన దొంగల శ్రీకాంత్‌రెడ్డి, గుర్రం భూంరెడ్డి, చింతల మహేశ్‌గౌడ్ హనుమాన్ మాల వేసుకోగా గుడి గేటుకు చౌక్కాతో కట్టి దళిత స్వాములు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా 'మీ తాతలు గుడిలోకి రాలేదని మీరు రావొద్దని ఎంత దమ్ము ఉంటే గుడిలోకి వస్తారని..మీరు అంటరాని వారు తక్కువ కులానికి చెందిన వారని అవమానించారు. గుడిలోకి రావాలంటే కులం పేరు మార్చుకోవాలని బెదిరించడంతో మిట్టపల్లి కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్సై అపూర్వరెడ్డి, సీఐ శ్రీను గ్రామంలో ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనంతరం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు.

బాల సాహితీవేత్తకు సన్మానం

కాంతికృష్ణను సన్మానిస్తున్న డాక్టర్ చెన్నయ్య

చేర్యాల, మే 29 : తెలంగాణ సారస్వత పరిషత్ అబిడ్స్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాలసాహిత్య సమ్మేళనం'లో చేర్యాల పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బాలసాహితీవేత్త గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ ఘన సన్మానం అందుకున్నారు. 'బడిలో తెలుగుభాష' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్టిలో కాంతికృష్ణ పాల్గొని అభిప్రాయాలు తెలియజేయడంతో పరిషత్ అధ్యక్ష,కార్యదర్శులు ఆచార్య శివారెడ్డి, డా. చెన్నయ్య సన్మానించారు.సన్మానం పొందిన కాంతికృష్ణను చేర్యాల కవులు రామచంద్రమూర్తి, అయిలయ్య, రా మాంజనేయులు, భీపాల్, అంజయ్య, ఉమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌శర్మ, ఉపేందర్ రావు, ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

జూన్ 5లోపు యూనిఫామ్‌లు పంపిణీ చేయాలి

సిద్దిపేట అర్బన్, మే 29 : పాఠశాలలకు జూన్ 5వ తేదీలోపు మొదటి విడత స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీవో, ఎంపీవో, ఏపీఎం, మెప్మా అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈజీఎస్ పనులో డంపింగ్ యార్డు, వైకుంఠధామాల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. హరితహారానికి సంబంధించి మండలాల వారీగా ఇచ్చిన టార్గెట్ ఆధారంగా ఎస్టిమేట్ జనరేట్ చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, నాటడానికి సైట్‌ను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్యా, డీపీఓ దేవకీదేవి, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు

చేర్యాలలోని ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు

చేర్యాల, మే 29 : పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ షాపులను బుధవారం వ్యవసాయ, పోలీస్‌శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు.పట్టణంలోని రాజరాజేశ్వర ఫర్టిలైజర్ షాపులో పత్తి విత్తన ప్యాకెట్లను అధికారులు పరిశీలించారు. ప్యూచర్ క్రాఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అన్నదాత ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏడీఏ రాధిక, సీఐ శ్రీను మాట్లాడుతూ డీలర్లు నాసిరకం విత్తనాలు అమ్మకూడదని, అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.ఎరువులను కృత్రిక కొరత సృష్టించవద్దని, గ్రామాల్లో లూజ్ పత్తి విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.కార్యక్రమంలో వ్యవసాయశాఖ మండల అధికారి ఆఫ్రోజ్, ఎస్సై దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా ఉండాలి

హుస్నాబాద్‌టౌన్, మే 29: నకిలి విత్తనాలపై రైతులు జాగ్రత్తగా ఉండాలని ఏఈవో శివారామ్ సూచించారు. హుస్నాబాద్‌లో రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనేటప్పుడు రసీదు తీసుకోవాలని, అధిక ధరలకు కొనవద్దన్నారు. ప్యాకెట్ కాకుండా లూజ్‌గా ఎవరు కూడా విత్తనాలను తీసుకుని మోస పోవద్దని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రైతులు గురా ల సంజీవరెడ్డితోపాటు పలువురు ఉన్నారు.

వ్యాపారులను నమ్మి మోసపోవద్దు

దుబ్బాక,మే 29: గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయించేందుకు వచ్చే వ్యాపారులను నమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ రైతులకు సూచించారు. దుబ్బాక మండలం కమ్మర్‌పల్లి, హబ్షీపూర్ తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం దుబ్బాక పట్టణంలో ని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశా రు. ఏఈవోలు సంతోష్‌కుమార్, హరీశ్‌కుమార్, మహేష్, చైతన్య, అస్మాపాల్గొన్నారు.

విత్తన్న దుకాణాల్లో తనిఖీ

బెజ్జంకి, మే 29: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, విత్తన్న విక్రయ దుకాణాల్లో వ్యవసాయశాఖ, పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతి ఉన్న కంపెనీ ధ్రువపత్రాలు, బిల్లులు, రికార్డుల నిర్వహణ, నిల్వలను పరిశీలించారు. కాలం చెల్లిన విత్తనాలు, మందులను గమనిస్తూ దుకాణం నుంచి తొలిగించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి సంతోష్‌కుమార్, ఏఎస్సై శంకర్‌రావు, ఏఈవో సాయిశంకర్ పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు

మద్దూరు(ధూళిమిట్ట), మే29: నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు మద్దూరు ఎస్సై షేక్ యునూస్ అహ్మద్‌అలీ అన్నారు. మద్దూరు మండల కేంద్రంతో పాటు రేబర్తి, ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలోని ఫర్టిలైజర్ షాపులను ఏవో రామకృష్ణతో కలిసి ఆయన తనిఖీ చేసి, రిజిస్టర్‌తో పాటు, స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేశ్, కల్పన పాల్గొన్నారు.

మద్దూరు(ధూళిమిట్ట): మద్దూరులో ఫర్టిలైజర్ షాపులో విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్సై , ఏవో

కొమురవెల్లిలో..

కొమురవెల్లి, మే 29 : కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏవో నరేశ్, హెడ్ కానిస్టేబుల్ బాబు అన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయశాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

కొండపాక మండలంలో ...

కొండపాక,మే 29: మండలంలో పోలీసులు, వ్యవసాయాధికారులు విత్తన దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సిద్దిపేట త్రీటౌన్ ఎస్సై సూర్యనారాయణ, ఏవో ప్రియదర్శిని మండలంలోని బందారం, అంకిరెడ్డిపల్లి, మర్పడగ, సిర్సినగండ్లలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, నోటీస్ బోర్డు, లైసెన్స్ తదితర వాటిని పరిశీలించారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్, మే 29 : విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీ మహేశ్ హెచ్చరించారు. హుస్నాబాద్ పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో స్థానిక ఎస్సై మహేశ్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

టిప్పర్లు పట్టివేత

బెజ్జంకి, మే 29: మండలంలోని చీలాపూర్‌పల్లి నుంచి బెజ్జంకికి అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లు, జేసీబీని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలోని గాగిల్లాపూర్ మోయతుమ్మెదవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బెజ్జంకి పోలీసులు స్వాధీనం చేసుకొని పీఎస్‌కు తరలించారు.

ముగిసిన ఆధ్యాత్మిక శిబిరం

సిద్దిపేట టౌన్,మే 29 : బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో కొనసాగిన బాలానందం ఆధ్యాత్మిక వేసవి శిబిరం బుధవారం ముగిసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాకారులు రాజేశ్,ప్రార్థిని క్లాసికల్ డ్యాన్సర్, బుక్ ఆఫ్ వరల్డ్ గ్రహీత శ్రేయ హాజరయ్యారు.అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకురాలు భవాని బహుమతులు,భగవద్గీత బుక్స్ అందజేశారు. సంస్థ ప్రతినిధులు స్వప్న, స్రవంతి,వైష్ణవి,భవాని,భాగ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయం వార్షికోత్సవాలు

సిద్దిపేట టౌన్,మే 29 : సిద్దిపేట మోహినీపురలో వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయం 49వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా బుధవారం సుప్రభాత సేవ,ప్రాతకాల,సాయ ఆరాధన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొండపాక ఎంపీపీగా మంచాల అనసూయ

మంచాల అనసూయ కనకరాములు దంపతులను సత్కరిస్తున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక,మే29: మండలం కేంద్రంలోని ఐవోసీ భవనంలో అడిషనల్ డీఆర్డీఏ బాలకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. రిజర్వేషన్ ప్రకారం బీసీ మహిళ మంచాల అనసూయ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. మంచాల అనసూయ ఎంపీపీ అభ్యర్థిగా చింతలసాయిబాబా ప్రతిపాదించగా పత్తి ఆంజనేయులు బలపర్చారు. కేవలం ఒక్కరే నామినేషన్ వేయడంతో మంచాల అనసూయ కనకరాములు ఏకగ్రీవంగా ఎంపీపీగా ఎన్నికయ్యారని బాలకృష్ణ ప్రకటించారు. ర్యాగళ్ల సుగుణ, వైస్ ఎంపీపీ దేవీరవీందర్, మంగోల్ ఎంపీటీసీ హరిత గైర్హాజరయ్యారు. అనంతరం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగారావు, మల్లికార్జున్, చిరంజీవి, అండాలమ్మ, రుషి, ఆంజనేయులు, తోటకూర మల్లేశం, కృష్ణారెడ్డి, ఎర్రోళ్ల రమేశ్ ఎంపీపీగా ఎన్నికైన మంచాల అనసూయ కనకరాములు దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

31న జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సిద్దిపేట, మే 29: ఈనెల 31న ఉదయం 8:00 గంటలకు సిద్దిపేట పట్టణంలోని ఆచార్య జయశంకర్ స్టేడియంలో అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కర్రోళ్ల వెంకట స్వామి గౌడ్ తెలిపారు. స్త్రీ, పురుషుల విభాగం అండర్–8,10,12, 14,16,18,20, ఓపెన్ విభాగంలో వేరువేరుగా ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 30న సాయంత్రం ఐదు గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కృష్ణకుమార్ 9704661898, నిషాంక్ గౌడ్ 8501977079, 9704061543ను సంప్రదించాలన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

దుబ్బాక, మే 29: దుబ్బాక రేకులకుంట మల్లఖార్జున దేవాలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. దేవాలయ ఈవో మోహన్‌రెడ్డి, కోటిలింగేశ్వరాలయ ఈవో రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో హుండీ లెక్కించగా రూ.15,57,417 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దూరు(ధూళిమిట్ట), మే29: మద్దూరు, మర్మాముల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారంఉదయం 8 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సుధీర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన పరిధిలోని విద్యుత్ మెయిన్ లైన్ వైరుకు తాకుతున్న చెట్లకొమ్మలను తొలిగించేందుకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కొండపాక,మే 29 : ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేధినీపూర్ గ్రామానికి చెందిన కిష్టాపురం నరసయ్య (65) బుధవారం కుకునూర్‌పల్లి మీ సేవకు సైకిల్‌పై వెళ్తుండగా సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భూంపల్లిలో దుర్గయ్యను పరామర్శిస్తున్న ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దుబ్బాక, మిరుదొడ్డి, మే 29: దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట–భూంపల్లి మండలం భూంపల్లిలో ఇటీవల మృతి చెందిన చిర్రం ఎల్లవ్వ కుటుంబ సభ్యులను బుధవారం రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంటకయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం అదే గ్రామంలో ప్రమాదవశాత్తు గాయపడిన బొల్లు దుర్గయ్యను పరామర్శించి, ఆరో గ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు శ్రీనివాస్, స్వామి, కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల జాబితా విడుదల

దుబ్బాక, మే 29: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేసినట్లు ఆపాఠశాల ప్రిన్సిపాల్ సుప్రి య తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాలతోపాటు దుబ్బా క మండల వనరుల కేంద్రం వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరో తరగతి ప్రవేశంతో పాటు పాఠశాలలో 7,8,9,10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థుల జాబితా ప్రకటించినట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో ఈనెల31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ధాన్యం దిగుమతి చేసుకోలే..

నంగునూరు, మే 29 : ధాన్యం దిగుమతి చేసుకోకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసిన ఘటన తొగుట మండలంలోని చందాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామంలోని బెజగామ ధర్మయ్య, కమ్మరి సత్తయ్య ఐకేపీ ద్వారా నంగునూరు మండలంలోని రాంపూర్ మహాలక్ష్మీ పారాబాయిల్డ్ మిల్లుకు మంగళవారం రాత్రి ధాన్యం పంపించారు. బుధవారం మధ్యాహ్నం మిల్లు యజమాని రైతుకు ఫోన్ చేసి వడ్లుబాగాలేవు తీసుకోమని చెప్పడంతో రైతులు మిల్లు వద్దకు చేరుకున్నారు. శాంపిల్ సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఒకటి లేదా రెండు శాతం ముక్క బియ్యం రాగా.. మొత్తం ముక్క బియ్యమే వస్తున్నాయని.. వడ్లు మాకు వద్దని అంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

మిల్లుకు తెచ్చిన ధాన్యంతో రైతులు

ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాజునాయక్

హుస్నాబాద్, మే 29: రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్ డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్‌లోని జీకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యతో వ్యాపారం చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని పాఠశాలల యాజమాన్యం టెక్నో, కాన్సెప్ట్, వరల్డ్ ఐఐటీ, జేఈఈ లాంటి పేర్లు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునే కుట్రలు చేస్తున్నారని, ఈ పేర్లను వెంటనే తొలిగించాలన్నారు. పాఠశాల్లో పుస్తకాలు, యూనిఫామ్‌ల వ్యాపారాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. డొనేషన్ల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్న పాఠశాలలపై విచారణ జరపాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలతో పాటు వాటికి అనుబంధంగా నడుపుతున్న హాస్టళ్లలో కనీస సౌకర్యాలు ఉండటం లేదని ఆరోపించారు. ఎల్‌హెచ్‌పీఎస్ నా యకులు సత్యంనాయక్, మోతీలాల్, తిరుపతినాయక్, కృష్ణనాయక్, సక్రునాయక్, వీరన్ననాయక్, శ్రీనునాయక్, జవహర్‌లాల్‌నాయక్, భీమానాయక్, హర్యానాయక్ పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

గజ్వేల్, మే 29: గజ్వేల్ డివిజన్ పరిధిలోని రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని ఏడీఏ బాబునాయక్ అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని ఆయన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని గజ్వేల్, రాయపోల్, కొండపాక మండలాల్లో పత్తి విత్తన ప్యాకెట్లు 52,952 అవసరం ఉండగా ప్రస్తుతం దుకాణాల్లో 1,35,000 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వరి విత్తనాలు 12,600 క్వింటాళ్లు అవసరం ఉండగా దుకాణాల్లో 13,200 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నాయని, మొక్కజొన్న 332 క్వింటాళ్లు, కందులు 56 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. రైతుల పత్తి విత్తనాల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీటీ–2పార్ములా అనేది అన్ని విత్తన కంపెనీలకు వర్తిస్తుందన్నారు. దళారులు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయాధికాలను సంప్రదించాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలకు ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం యూరియా 450 టన్నులు, కాంప్లెక్స్ 560 టన్నులు, డీఏపీ 339 టన్నులు, పొటాష్ 150 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే సెల్: 7288894470, 7288894473కు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు రథోత్సవం

వర్గల్,మే 29: మండలకేంద్రంలోని ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన శ్రీరుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో వేదపండితులు వేదాంతం రాఘవాచార్యులు, మురళీధరాచార్యుల ఆధ్వర్యంలోమూలవరులకు ప్రత్యేక పూజలు జరిగాయి. గురువారం ఉదయం జరిగే స్వామివారి రథోత్సవాన్ని పురస్కరించుకొని సాయంత్రం రథపూజాధికార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్త పొద్దుటూరి రాజుగుప్తా, ఆలయపునః నిర్మాణకర్త టేకులపల్లి రాంరెడ్డి, గీతాజ్ఞానమండలి సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దుబ్బాక జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

దుబ్బాక, మే 29 : విదేశీయాత్ర ముగించుకుని బుధవారం స్వదేశానికి తిరిగి వచ్చిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి దుబ్బాక బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, నాయకులు కొత్త కిషన్‌రెడ్డి, గన్నే భూంరెడ్డి, బాలకిషన్‌గౌడ్, ఆస స్వామి, సత్యనారాయణ, సుధీర్ పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తిచేయాలి

హుస్నాబాద్‌టౌన్, మే 29: పట్టణంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను బుధవారం కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ పరిశీలించారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించి త్వరగా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ సాయిప్రణిత్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారులకు భిక్ష

దుబ్బాక,మే 29: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో బుధవారం హనుమాన్ మాధదారులకు దుబ్బాక మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.రఫీ భిక్ష ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాలధారులు భజన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

దుబ్బాక, మే 29 : దుబ్బాకలో బుధవారం టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద టీపీటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ రాజమౌళి హాజరై మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు అమ్మన నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు రమేశ్‌గౌడ్, సిద్ధిరాములు, ప్రదీప్, ఎల్లం, నూర్‌బాబా, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టుల బహూకరణ

బెజ్జంకి, మే 29: మండలంలోని వడ్లూర్‌బేగంపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సాఫ్ట్‌బాల్ ఉచిత వేసవి శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీషర్టులు బహూకరించారు. విద్యార్థులకు టీషర్టులు అందించిన అసోసియేషన్ అధ్యక్షుడు కైలాసంగుప్తాకు పీఈటీ వెగ్గళం సతీశ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రమ్య, అసోసియేషన్ ప్రతినిధులు రేణుక, శ్యామ్‌సుందర్ శర్మ, సుమన్, భాస్కర్, నవీన్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది
నేను, మొహమ్మద్ ఇబ్రహీం, తండ్రి: ఖాజామియ, నివాసం: ఇం.నెం. 2-24, ఇటిక్యాల గ్రామం, జగదేవ్‌పూర్ మండలం, సిద్దిపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం, తెలియజేయునది ఏమనగా, నా యొక్క ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్‌డీడ్ నెం. 1469 ఆఫ్ 1991 గలది ఇటిక్యాల నుండి జగదేవ్‌పూర్‌కు ప్రయాణిస్తుండగా పోయినది. దొరికినవారు సంప్రదించగలరు:
9849468397

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు దుబ్బాక, సిద్దిపేట జిల్లా
ఓ.ఎస్.నం.10/2024
కేసరి యాదయ్య అలియాస్ కొట్టా యాదయ్య ..అర్జీదారు
మరియు
కేసరి బాలకిషన్ & ఇతరులు ..ప్రతివాదులు
గోవిందరామ్ కోటేశ్వర్ తండ్రి గోవిందరామ్ గాలయ్య, వయస్సు 53 సం॥లు, వృత్తి: వ్యవసాయం, నివాసం: కాసులాబాద్ గ్రామం, మీరుదొడ్డి మండలం, సిద్దిపేట జిల్లా ...ప్రతివాది నం. 5
నోటీసు
పై తెలిపిన ఓ.ఎస్ నం. 10/2024 అర్జీదారు ఆస్థి భాగపరిష్కార నిమిత్తమై పై తెలిపిన ప్రతివాదులపై వేసియుండెను. సదరు కేసు ప్రతివాది నం. 5 అనగా గోవిందరామ్ కోటేశ్వర్ తండ్రి గోవిందరామ్ గాలయ్య, వయస్సు : 53 సం॥లు, వృత్తి : వ్యవసాయం, నివాసం: కాసులబాద్ గ్రామం, మీరుదొడ్డి మండలం, సిద్దిపేట జిల్లా యొక్క హాజరు నిమిత్తమై తేది 10-06-2024 న పై తెలిపిన మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి దుబ్బాక, సిద్దిపేట జిల్లా నందు స్వతహాగా గానీ లేదా వారి తరపున న్యాయవాది గానీ సదరు కోర్టు నందు సమయం ఉదయం 10-30 గంటలకు హాజరుకావలెను. ఒకవేళ సదరు తేదిన పై తెలిపిన కోర్టు నందు ప్రతివాది గానీ, వారి తరపున న్యాయవాది గానీ హాజరు కాలేని యెడల కోర్టు వారు ఉన్నటువంటి డాక్యుమెంట్స్ మెరిట్‌లపై నిర్ణయం తీసుకోగలరు.
(కోర్టు ఆర్డర్ ద్వారా)
మీనాంబర్ సానె, న్యాయవాది, బ్లాక్ నెం. బి. ఫ్లాట్ నం.802, ఉస్మాన్ నగర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ, సంగారెడ్డి జిల్లా, (హైదరాబాద్). సెల్ నం. 9396310402